క్లుప్తంగా

రూ. 3లక్షల ఎల్‌వోసీ అందజేత



డొంకేశ్వర్: అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్‌కు చెందిన గంట గంగాధర్‌కు మెరుగైన వైద్యం కోసం రూ. 3లక్షల ఎల్‌వోసీ అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి చొరవ తీసుకుని సీఎంతో మాట్లాడి ఎల్‌వోసీ ఇప్పించారని పార్టీ నికాల్‌పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు సుమన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమ్‌నాయక్. సంతోష్ రెడ్డి, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



రెంజల్: మండలంలోని నీలా గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నాల్గవ వార్షికోత్సవ వేడుకలను చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసి ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ పండుగతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

సేంద్రియ పద్ధతిలో పంటల సాగు పరిశీలన



వేల్పూర్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఫ్రెస్నో నగరం పొలిమేరలోనున్న కర్నీ అగ్రికల్చర్ పార్కును బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. అక్కడ సేంద్రియ పద్ధతుల్లో స్వీట్ పొటాటో, ఇతర పంటలను సాగు చేసే తీరును తెలుసుకున్నారు. ఇండో ఆఫ్రికన్ రైతు ప్రతినిధి, పార్కు మేనేజర్ క్రిస్ ఫీల్డ్, మహిళా రైతు హెన్స్‌లను ఆధునిక సాగు విధానాలను, రైతు కూలీ జాన్‌తో మాట్లాడి పంటల సాగుతీరు గురించి తెలుసుకున్నారు.

దర్గాను దర్శించుకున్న చార్మినార్ ఎమ్మెల్యే



రెంజల్: మండలంలోని నీలా శివారులోని సైలాని వహీద్ బాబా దర్గాను శనివారం రాత్రి చార్మినార్ ఎంఐఎం ఎమ్మెల్యే జుల్ఫేకర్ అలీ దర్శించుకున్నారు. దర్గాలో ప్రత్యేక పూజలు చేసి చాదర్‌ను బహూకరించారు. గతంలో దర్గాను దర్శించుకున్న ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత వస్తానని మొక్కుకున్నారు. దర్గా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. దర్గా వద్ద నిర్వాహకుడు వహీద్‌బాబాతో పాటు భక్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో హాజీఖాన్, మూసా తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



వేల్పూర్: మండల కేంద్రంలో స్థానిక వీడీసీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. పవిత్ర గోదావరి నీటిని తీసుకొచ్చి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు వెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి గ్రామ దేవతలను గోదావరి నీటితో అభిషేకించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని పంటలు బాగా పండాలని గ్రామదేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేరుకే ఏరియా ఆస్పత్రి

- వైద్యుల కొరతతో ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

నవీపేట: మండల కేంద్రంలోని ఆస్పత్రి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ పేపర్ల మట్టుకే అప్‌గ్రేడ్ అవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా కొనసాగిన ఈ ఆస్పత్రి 30 పడకల ఆస్పత్రిగా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా పదోన్నతి పొంది ఏడాది క్రితం ఏరియా ఆస్పత్రికి మరింత అప్‌గ్రేడ్ అయింది. వైద్య విధాన పరిషత్ ఆధీనంలో సేవలందించే ఏరియా ఆస్పత్రిలో అధునాతన సేవలు అందుతాయని రోగులు భావించారు. అత్యవసర పరిస్థితిలో ఉత్తమ వైద్యాన్ని అందించే వైద్యులు అందుబాటులో ఉంటారని భావించిన రోగులకు నిరాశే ఎదురవుతోంది.

వేధిస్తున్న వైద్యుల కొరత

పదోన్నతి పొందుతూ వస్తున్న నవీపేట ఆస్పత్రిలో అది నుంచి వైద్యుల నియామక ప్రక్రియలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు పర్మినెంట్ వైద్యుల నియామకం లేదు. ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రుల్లో ఇంత వరకు ప్రత్యేక వైద్యుల నియామకం జరుగలేదు. గైనకాలజిస్ట్, పీడియాట్రిస్ట్, ఆర్థోపెడిక్, అనస్థీషియా వంటి ప్రత్యేక వైద్యుల నియామకం ఇంకా జరుగలేదు. ఎక్స్ రే ప్లాంట్, స్కానింగ్ విభాగాల ఏర్పాటు ప్రక్రియ ఊసేలేదు.



నవీపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్

తూతూ మంత్రపు సేవలు

ఏరియా ఆస్పత్రిలో ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ఇద్దరు మహిళా వైద్యాధికారులు, 8 మంది స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్ట్‌తో సేవలు అందిస్తున్నారు. 12 మంది శానిటేషన్ సిబ్బంది నియామకం మాత్రం పూర్తి చేశారు. అత్యవసర సమయాల్లో గర్భిణులకు వైద్యం అందక జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. పాము కాటు వైద్యం ఆశించిన స్థాయిలో అందడం లేదు. వైద్యులు, సిబ్బంది కొరతతో రాత్రి వేళల్లో సరైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పేపర్లకే పరిమితం..



మండల కేంద్రంలో అధునాతన సదుపాయాలతో ఆస్పత్రిని నిర్మిస్తామంటే 25 ఏళ్ల క్రితం సంబంధిత భూయజమానులను ఒప్పించి భూసేకరణ చేశాం. పీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా సరైన వైద్య సేవలు అందడం లేదు. వైద్యులు లేక ఏరియా ఆస్పత్రి అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది.

– తెడ్డు పోశెట్టి, మాజీ ఉప సర్పంచ్, నవీపేట

వైద్య సేవలు అందడం లేదు



ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్య సేవలకు ఇబ్బంది అవుతోంది. రాత్రిళ్లో ఈ సమస్య మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. అత్యవసర సమయాల్లో గర్భిణులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. అన్ని సదుపాయాలు కల్పించి అన్ని రకాల వైద్యులను నియమించాలి.

– జదల నరేశ్, నవీపేట

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మోర్తాడ్‌లోని వివేకానంద విద్యాలయం విద్యార్థులు

మోర్తాడ్/ పెర్కిట్/ కమ్మర్‌పల్లి: మోర్తాడ్ మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో 1998–99కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకొని ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99కు చెందిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం చేపట్టారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెర్కిట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



కమ్మర్‌పల్లిలో పూర్వ విద్యార్థులు

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గ్రామం నుంచి భీమ్‌గల్ వెళ్లే దారిలో ఊర చెరువుకు ఎదురుగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో పశువులకు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల క్రితం అధికారులు రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని అప్పుడు రోడ్డు ఎత్తు తక్కువగా ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తులో ఉండేదని, ప్రస్తుతం రోడ్డు ఎత్తు పెరగడంతో దాని పక్క నుంచి వెళ్లే ప్రజలకు, పశువులకు తాకే విధంగా మారింది. పశువులు విద్యుత్ స్తంభాలకు తగిలి మృతిచెందే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా భీమ్‌గల్, ఆర్మూర్ వెళ్లేందుకు ప్రయాణికులు ఇదే రహదారిలో నిత్యం వేలాదిగా ప్రయాణిస్తుంటారు. ఆకస్మికంగా వాహనాలు అదుపుతప్పితే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనే అవకాశం ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే ట్రాన్స్‌ఫార్మర్‌కు బలమైన కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పచ్చలనడ్కుడలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

గ్రంథాలయం.. సమస్యల వలయం

- శిథిలావస్థకు చేరిన భవనం
- పట్టించుకోని అధికారులు

నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్‌లో ఉన్న శాఖ గ్రంథాలయంలో సమస్యలు తిష్ఠ వేశాయి. మండలంలోని పెద్ద గ్రామాల్లో కుద్వాన్‌పూర్ ఒకటి. ఈ గ్రామానికి ఎంతో చరిత్ర ఉంది. నిజాం కాలంలో ఆస్థానంగా వెలుగొందిన ఈ గ్రామంలో గ్రంథాలయం ఆదరణ లేకుండా పోతోంది. కుద్వాన్‌పూర్‌లో సుమారు 70 ఏళ్ల క్రితం గ్రంథాలయం ఏర్పడింది. కానీ రికార్డులు మాత్రం 1983 నుంచి అందుబాటులో ఉన్నాయి. అద్దె భవనంలో కొనసాగిన శాఖ గ్రంథాలయం కొన్నాళ్ల నుంచి గ్రామ పంచాయతీ ఆవరణలోని చావిడిలో కొనసాగుతోంది. కుద్వాన్‌పూర్ శాఖ గ్రంథాలయంలో పనిచేసిన స్వీపర్ లింగయ్య పదోన్నతిపై ఆర్మూర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎజాజొద్దీన్‌ను తాత్కాలిక ఉద్యోగిగా అధికారులు నియమించారు. రూ. 100 రుసుం చెల్లించి 103 మంది గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్నవారు ఉన్నారు. గ్రంథాలయంలో 3404 వివిధ రకాల నవలలు, పుస్తకాలు ఉన్నాయి. రోజుకు మూడు దినపత్రికలు తప్ప పోటీ పరీక్షలకు అవసరమయ్యే వార, పక్ష పత్రికలు రావడం లేదు.



కుద్వాన్‌పూర్ చావిడిలో కొనసాగుతున్న గ్రంథాలయం



గ్రంథాలయంలోని పుస్తకాలు, నవలలు

శిథిలావస్థలో భవనం

గ్రామ పంచాయతీ ఆవరణలోని చావిడిలో నిర్వహిస్తున్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం పడ్డప్పుడు పైకప్పు ఊరుస్తోంది. గ్రంథాలయంలో గ్రంథపాలకుడు లేకపోవడంతో స్వీపర్ అన్ని తానై గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నాడు.

పర్మినెంట్ చేయాలి

పదేళ్లగా కుద్వాన్‌పూర్ శాఖ గ్రంథాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాను. రోజుకు ఆరు గంటలు పనిచేస్తున్నాను. గ్రంథాలయ నిర్వహణ, రికార్డుల నమోదు అన్ని చూసుకుంటాను. అధికారులు స్పందించి నా ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలి.

– ఎజాజొద్దీన్, స్వీపర్, కుద్వాన్‌పూర్

గ్రంథపాలకుడిని నియమించాలి

కుద్వాన్‌పూర్ శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడిని నియమించాలి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అన్ని పత్రికలను అందుబాటులో ఉంచాలి. గ్రంథాలయానికి పర్మినెంట్ భవనాన్ని నిర్మించాలి. దినపత్రికలను అందుబాటులో ఉంచాలి.

– సుదర్శన్, పాఠకుడు, కుద్వాన్‌పూర్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

ఆర్మూర్‌టౌన్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని మేరు సంఘంలో మేరు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ చేయాలని కోరారు. అనంతరం మేరు సంఘంలోని శివాలయంలో మేరు కులస్తుల కుల దైవమైన శ్రీ శంకర దాసమయ్య 26వ జయంతి వేడుకలను ఘనంగా చేపట్టారు. శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రవినాథ్, కార్యదర్శి డీకొండ లక్ష్మణ్, కోశాధికారి సంగ్వి గంగాధర్, ఉపాధ్యక్షుడు అరుణ్, మేవా అధ్యక్షుడు కిషన్, ప్రధాన కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల పండుగ

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి, ఠానాకలాన్ గ్రామాల్లో బోనాల పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని పలు కుల సంఘాలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

విజ్ఞాన కేంద్రం కమిటీ ఎన్నిక



బోధన్: సాలూర మండల కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ) అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం లైబ్రరీ భవనంలో గ్రామ పెద్దలు, శాశ్వత సభ్యులు సమావేశమై చర్చించారు. నూతన అధ్యక్షుడిగా మల్లెపూల స్వామిగౌడ్, ఉపాధ్యక్షులుగా కరణం అశోక్‌బాబా, ఇల్తెపు రమేశ్, శివకాంత్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా లింబూరి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా వడ్ల దత్తురాం, నజీర్, ముఖ్య సలహాదారులుగా ఇల్తెపు శంకర్, మిద్దెల రాజు, సింగాడే పాండు, ఇల్తెపు బొర్ర గంగారాం, అల్లె రమేశ్‌ను ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. గ్రామ పెద్దలు సంగు మహరాజ్, కేజీ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ సభ్యులు స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో భాగంగా హనుమాన్ ఆలయ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అందరికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివరాజ్ కుమార్, కొంతం రాజు, రాజ్‌కుమార్, గడ్డం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలేవి?

- సర్వే నివేదిక ఇచ్చినా చర్యలు శూన్యం
- 1333 సర్వే నంబరులో ప్రభుత్వ భూమిపై సర్వే
- అంతా గప్ చుప్..

బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమి సర్వేపై అంతా గప్‌చుప్ అయ్యారు. సర్వే నంబరు 1333లో 224.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 64 ఎకరాలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలను, జాతీయ రహదారి 44 నిర్మాణం కోసం కేటాయించారు. కానీ మిగతా భూమిని కొందరు భూకబ్జాదారులు సుమారు 3 ఎకరాల వరకు కబ్జా చేశారని తీవ్ర ఆరోపణలు రావడంతో కలెక్టర్ స్పందించి ప్రత్యేక సర్వే బృందంతో సర్వే చేయించారు. 45 రోజుల పాటు సర్వే కొనసాగి కబ్జాకు గురైన చోట భూమిని గుర్తించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. హద్దు ఏర్పాటులో కూడా తేడాలు రావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. సర్వే పూర్తయి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు భూకబ్జాదారులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సర్వే చేపట్టిన ప్రత్యేక బృందం స్థానిక అధికారులకు నివేదిక సైతం అందజేశారు. కానీ ఇందులో బడా బాబుల హస్తం ఉండటంతో చర్యలు చేపట్టడానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అసలు ప్రభుత్వ భూమి ఎంత ఉంది, ఎంత మేర కబ్జా అయిందనే విషయాన్ని బయట పెట్టకుండ అధికారులు జాగ్రత్త పడటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సర్వే నివేదికను వెంటనే బయట పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



సర్వే చేపడుతున్న సర్వే బృందం(ఫైల్)

పట్టాల కోసం సర్వే

సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు బోగస్ సర్టిఫికెట్లతో దందా చేస్తున్నారనే విమర్శలు రావడంతో సర్వే బందం ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న వారి పట్టాలను సైతం సర్వే చేపట్టారు. సర్వే ప్రారంభం కాగానే అనేక పట్టాలు బయటకు వచ్చాయి. కొందరు ఏకంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేశారు. కానీ అధికారులు గుర్తించి గుడిసెలను తొలిగించారు. కానీ బోగస్ సర్టిఫికెట్లు తయారు చేసిన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికీ పట్టాకు రూ. 40 వేలు ఇస్తే పట్టాలను విక్రయిస్తున్నట్లు సమాచారం. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నివేదిక అందజేశాం

మండల కేంద్రంలోని సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నివేదికను రెవెన్యూ అధికారులకు అందజేశాం. స్థానికులు, వీడీసీ సభ్యుల సమక్షంలో హద్దురాళ్లను ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– వెంకటేశ్వర్లు, డీఐవో సర్వే, నిజామాబాద్

ఉచిత వైద్య శిబిరం



బోధన్ టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో ఉన్న బస్తీ దవాఖానలో హోప్ వెల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీలోని నిరుపేదలకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యురాలు తన్విరిఖాన్, వైద్యులు సాయికుమార్, రఫీకా, కౌన్సిలర్ మీర్ నజీర్ అలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫ్యూరియోసా (తెలుగు) - 12.25, రాజుయాదవ్ (తెలుగు) - 3.40, 6.20, 9.00
స్క్రీన్-3 –	లవ్‌మీ (తెలుగు) - 11.50, ఫ్యూరియోసా (తెలుగు) - 02.45, 6.00, 9.15
స్క్రీన్-4 –	లవ్‌మీ (తెలుగు) - 1.30, 4.25, 7.20, 10.15

పెరిగిన వేతనాలు అందించాలి

ఆర్మూర్‌టౌన్: బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూమన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ అన్నారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీలు చుట్టే కార్మికులు, బీడీ ప్యాకర్లు, బట్టీవాలా, చెన్నివాలా, బీడీ చాటర్స్, ట్రెపిల్లర్, క్లర్క్‌లకు వివిధ కేటగిరిలకు చెందిన కార్మికులకు పెరిగిన వేతనాలను అందించాలన్నారు. బీడీ కార్మికుల ఐక్యతతోనే కూలీరేట్లు పెరిగాయని, కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని కోరారు. బీడీ యాజమాన్యాలు పెరిగిన వేతనాలను మే 1 నుంచి అమలు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, సహాయ కార్యదర్శి ఎం సుప్రియ, ఎస్ వెంకటేశ్ తదితరులులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమన్న

షఫీకి డాక్టరేట్

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ షఫీకి డాక్టరేట్ దక్కింది. 30 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలందిస్తున్న నేపథ్యంలో చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్ కేటగిరిలో పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ షఫీకి డాక్టరేట్ ప్రకటించింది. ఈ నెల 25న చెన్నైలోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా వైస్ చాన్స్‌లర్ చేతుల మీదుగా షఫీ డాక్టరేట్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ.. విద్యా రంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ వరించినట్లు తెలిపారు. డాక్టరేట్ పొందడంతో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా నూతన ఒరవడిని సృష్టిస్తూ విద్యార్థులకు మరింత సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సనా, పాఠశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి ప్రకాశ్ పాల్గొన్నారు.

